




# మానవత్వం

**- కారంపూడి వెంకట రామదాస్**

"నాన్నా! మిమ్మల్ని వదిలి వెళ్ళాలంటే చాలా బాధగా వుంది" మనసు మూగపోగా అన్నాడు శ్రీధర్.

"అవున్రా... నేనూ అమ్మా ఎంత వేదన పడుతున్నామో ఎలా చెప్పేది...? కనీసం కాలేజీ చదువులకి కూడా నిన్ను పక్క ఊరికి పంపించి ఎరగందీ... ఏకంగా దుబాయ్‌కి పంపాల్సొచ్చిందంటే అది మన ఆర్థిక పరిస్థితే". బాధతో అన్నాడు శర్మ.

"మీ మాటే యిలా వుంటే యిక అమ్మ సంగతేంటీ...? రెండ్రోజులుగా చాటుగా కళ్ళు తుడుచుకోవడం నేను చూస్తునే వున్నా. మీరే అమ్మకి నచ్చచెప్పండి. అమ్మకెదురు పడాలంటేనే ఏదోలా వుంది" అన్నాడు శ్రీధర్.

"సరే లేరా...! నే చూసుకుంటా.. నువ్వు నీ ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకో" అన్నాడు శర్మ.

"సరే. అలా వెళ్ళి మా స్నేహితుల్ని ఒకసారి కలిసి వస్తా..." అంటూ బయటకి నడిచాడు శ్రీధర్.

కొడుకు వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచిస్తున్నాడు శర్మ.

తెలంగాణ ప్రజలు జీవనోపాధికి దుబాయ్ పోవడం సర్వసాధారణం. అదే స్థితి తనకీ వస్తుందని కల్లోకూడా ఊహించలేదు శర్మ.

ఊర్లో వీధులకి వీధులే ఒకప్పుడు ఆస్తులుగా కలిగివున్న వంశం శర్మది. అలాంటిది ఈ రోజు జీవనాధారంకోసం ఊర్లో ప్రతి ఒక్కరూ అనుసరించే విధంగా సొంత కొడుకునీ దుబాయ్ పంపే దుస్థితొచ్చిందంటే.. ఎంత పతనమైయ్యాడో అర్థంచేసుకోవచ్చు. తాతలు ఆస్థుల్ని హారతికర్పూరం చేయడంతో శర్మదగ్గరకొచ్చేసరికీ ఓ కొంపా.. ఐదెకరాల పొలం మిగిలింది. వాటితో చాలా ఏళ్ళు హాయిగానే నెట్టుకొచ్చినా యిద్దరు కూతుళ్ళ పెళ్ళీ, కొడుకు చదువులకి అది కాస్తా హరించుకుపోవడంతో ఈరోజు అద్దె కొంపలో దరిద్రాన్ని అనుభవిస్తూ.. చివరికి ఉద్యోగంకోసం కొడుకుని దుబాయ్‌కి పంపే స్థితికి రావడం నిజంగా శర్మకి కడుపు తరుక్కుపోయే విషయం. మొన్నటి వరకూ ఊర్లో వున్న పరువూ ప్రతిష్టలు కూడా పోయాయి. శర్మ ఎదురుపడితే తల వంచుకునిపోయే ఊరు జనం.. ఈరోజు అతడ్ని చూసి జాలిపడుతున్నారు. ఒకప్పుడు ఊరి పెద్దగా నలుగురికీ న్యాయం చెప్పిన అతడ్ని, యిప్పుడు ఎవ్వరూ పట్టించుకోని పరిస్థితి.

ఇదంతా ఆలోచిస్తూ శర్మ కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏవండీ..! అబ్బాయిని దుబాయ్ పంపక తప్పదంటారా..?" తన్నుకొచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక భోరుమంది శర్మ భార్య.

"ఛాఁఊరుకో..! ఈరోజుల్లో విదేశాలకి వెళ్ళడం సర్వసాధారణం. మనం అంతగా బెంగ పెట్టుకోనవసరం లేదు" భార్యకి సర్దిచెప్పేడే కానీ మనసులో అతడికీ గుబులుగా ఉంది.

తెలిసినవారి ద్వారా పరిచయమైన ఓ బ్రోకర్ మాట ప్రకారం డబ్బు అది కట్టీ యిక ఆ బ్రోకర్ పిలుపు కోసం ఎదురుచూస్తున్నాడు శర్మ. తన కొడుకుని దుబాయ్ పంపుతానన్న బ్రోకరు సరిగ్గా దుబాయ్ పంపుతాడో లేదో..? అన్న మాట ప్రకారం, అక్కడికి వెళ్ళాకా అర్హతకి తగ్గ ఉద్యోగం యిస్తాడా..? లాంటి సందేహాలూ మదిని తొలిచివేస్తున్నాయి. అయితే చేసేది లేకా అన్నింటికీ ఆ దైవంపై భారమేసి మరి నిర్ణయం తీసుకున్నారు.

❋ ❋ ❋

ఉదయాన్నే హైద్రాబాద్ ఎమ్.జి.బి.ఎస్ బస్‌స్టేషన్లో దిగాడు కొడుకుతో సహా. బ్రోకరు, వీసా, పాస్‌పోర్టు లాంటివి ఎరేంజ్ చేస్తాననీ ట్రావెలేజన్సీ ఎడ్రస్, ఓ ఫోన్ నెంబర్ యిచ్చి హైద్రాబాద్ రమ్మనడంతో యిద్దరూ భాగ్యనగరం చేరుకున్నారు.

తన బడ్జెట్లో బస్టాండుకి దగ్గర్లో ఓ సాధారణ లాడ్జిలో శర్మ రూమ్ తీసుకున్నాడు.

పదికల్లా యిద్దరూ తయారై చేతిలో వున్న ట్రావెల్ ఏజెన్సీ ఎడ్రస్‌ని మరొకసారి చదువుకొని రిసప్షన్ దగ్గరకొచ్చీ.

"సార్..! అమీర్‌పేట, ఆనంద్‌నగర్‌కి ఎలా వెళ్ళాలి?" అడిగాడు శ్రీధర్.

"నాలుగడుగులు వేస్తే చాదర్ ఘాట్ బస్‌స్టాప్ వస్తుంది. అక్కడ 225గానీ 156 నెంబరు బస్ ఎక్కితే డైరెక్టుగా అమీర్‌పేట చేర్చొచ్చు. అక్కడ అడిగి ఆనంద్‌నగర్ ఎక్కడుందో కనుక్కోండి" అని సలహా యిచ్చాడు లాడ్జి రిసెప్షనిస్ట్.

తండ్రీ, కొడుకులిద్దరూ చాదర్ ఘాట్ వరకూ నడిచీ అమీర్‌పేట పోయే బస్ నెంబర్లు వెతుక్కొని కష్టపడీ ఎలాగో బస్ ఎక్కారు. జనంతో కిక్కిరిసిన బస్సులో ఉక్కిరిబిక్కిరవుతూ ఒంటి కాలిమీద ప్రయాణం చేసారు. యించుమించు గంట నానా తంటాలు పడీ అమీర్‌పేట్ ఎలాగో చేరుకున్నారు.

అక్కడ నలుగుర్నీ అడిగీ ఎలాగో కష్టంమీద ఆనందనగర్లో ట్రావెల్స్ ఆఫీసుని పట్టుకున్నారు. ఆ ట్రావెల్స్ ఆఫీసు పేరు 'మిలన్ ట్రావెల్ ఏజెంట్స్' అక్కడి ఓ గుమస్తా వీరిని గమనించీ..

"రండి సార్..! ఏం కావాలి..?" అన్నాడు.

"సార్..! నా పేరు శర్మ. వీడు మా అబ్బాయి శ్రీధర్. మాది బెల్లంపల్లి. మీ మనిషి గిరీశం యిక్కడికి పంపాడు. మీరు మా అబ్బాయికి పాస్‌పోర్ట్ వీసా ఏర్పాటుచేస్తారని చెప్పాడు. అందుకోసమే వచ్చాం."

"ఎవడు ఆ మందమర్రి గిరీశమా..?" అన్నాడు గుమాస్తా.

"అవును.. అతడు మీ మనిషేగా..? మొత్తం లక్ష రూపాయలు యిచ్చాం. దానికి రసీదు కూడా యిచ్చాడు. ఆ రసీదు మీ కంపెనీదే. చూడండి" అన్నాడు శర్మ బేగులోంచి రిసీట్ తీసి చూపిస్తూ.

"ఏదీ..?" అంటూ ఆ రిసీటుని యిటు అటు చూసి పెదవి విరుస్తూ.."

"గిరీశం కనబడీ వారమైందీ.. ఫోన్ చేస్తే ఎత్తడు.. వందో, వెయ్యో కస్టమర్ల దగ్గరనుండీ కమీషన్ కొట్టేస్తున్నాడని తెలుసుగానీ, ఏకంగా దొంగ రసీదులో ప్రింటుచేసి అమాయకుల్ని మోసంచేసే వరకు వచ్చాడని యిప్పుడే అర్థమైంది. ఆ బద్మాష్‌గాడ్ని యిక వదిలి పెట్టేదిలేదు" అంటూ ఫోన్లో గిరీశంని పట్టుకునే ప్రయత్నం చేసాడు.

"అయ్యా.. గిరీశం మీ మనిషే గా..? యిది దొంగ

రసీదంటున్నారేంటీ...?.. నావద్ద వున్న మొత్తం డబ్బు ధారపోసాను. మాకన్యాయం చెయ్యకండి" దుఃఖం ముంచుకొస్తుంటే అన్నాడు శర్మ.

"గిరీశం మా కంపెనీ కోసం పనిచేసేవాడే, కానీ అతడి జాడ గత వారం పదిరోజులుగా లేదు. ఇది ఖచ్చితంగా దొంగ రసీదే.. యిదీ అసలైన మా రసీదు" అంటూ ఓ రసీదు పుస్తకం తీసి చూపించాడు గుమాస్తా..

రెండింటికీ చాలా తేడానే వుంది. గిరీశం యిచ్చింది దొంగ రసీదేనని తెలుస్తునే వుండటంతో తాము మోసపోయామని గ్రహించాడు శర్మ. కాళ్ళూ చేతులు ఆడలేదు. కళ్ళు బైర్లు కమ్మడంతో అక్కడున్న కుర్చీలో కుప్పకూలిపోయాడు.

తండ్రి పరిస్థితి చూసి శ్రీధర్ కంగారు పడ్డాడు. వెంటనే అక్కడున్న గ్లాసులో మంచినీళ్ళు తీసి తండ్రికి అందించాడు. కాసేపటికి తేరుకున్న శర్మ పూర్తిగా విచారంలో మునిగిపోయాడు.

అక్కడ జరిగిన సంఘటన చూసీ లోపల్నుండీ ట్రావెల్స్ మేనేజర్ వచ్చి విషయం తెలుసుకున్నాడు. వెంటనే కలగచేసుకునీ.

"కంగారు పడకండి సార్..! మా మనుషుల్ని పంపీ ఆ గిరీశంని వెతుకుతాం. అతడ్ని పట్టుకుంటాం" అంటూ ధైర్యం చెప్పాడు.

"మమ్మల్ని యిప్పుడేం చెయ్యమంటారూ?" అన్నాడు శ్రీధర్ ఏం చెయ్యాలో పాలుపోకా.

"మాకు దుబాయ్‌లో ప్లేస్మెంట్స్ వాళ్ళతో కూడా లింకులున్నాయి కాబట్టీ ఉద్యోగమైతే గ్యారెంటీ.. కాకపోతే మళ్ళీ మీరు మొత్తం డబ్బు కట్టాల్సిందే.. మీ అదృష్టం బాగుండీ గిరీశం దొరికీ వాడి దగ్గరనుండీ డబ్బు రాబట్టగలిగితే మీ డబ్బు మీకు వాపసు యిచ్చేస్తాం. ఎలాగో అంత దూరంనుండీ వచ్చారు కాబట్టీ రెండ్రోజులు యిక్కడే వుండి వెళ్ళండి" సమాధానమిచ్చాడు ట్రావెల్స్ మేనేజర్.

రెండ్రోజులు లాడ్జిలోనే వుంటూ రెండు పూటలా ఆ ట్రావెల్స్ చుట్టూ తిరిగినా ఫలితం కనబడలేదు. తండ్రీ కొడుకులకి.. ఊరునుండీ తెచ్చుకున్న డబ్బు కాస్త ఖర్చయిపోయింది. ఏం చెయ్యాలో పాలుపోని పరిస్థితి. చివరిసారిగా ట్రావెల్స్‌ని కలిసీ తాడోపేడో తేల్చుకోవాలనుకున్నాడు శర్మ. శ్రీధర్ కూడా పూర్తిగా విసిగిపోవడంతో అదే ఆలోచనలో వున్నాడు.

ఆరోగ్యం మందగించడంతో బస్సులో వెళ్ళే ఓపిక లేకా ట్రావెల్సు ఆఫీసుకి ఆటోలో బయలుదేరాడు శర్మ కొడుకుతో సహా.

ఆటోలో ప్రయాణిస్తూ యిద్దరూ ఎవరికి వారే ఏవేవో ఆలోచిస్తున్నారు. ఆటో డ్రైవరు ఆ యిద్దరి మొహాలూ విచారంతో కూడుకోవడం గమనించీ.

"సారూ..! మీది ఏ ఊరు..?" అంటూ మాటలు కలిపాడు.

"బెల్లంపల్లి" పొడిగా సమాధానమిచ్చాడు శ్రీధర్.

"ఏది.. ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లా..?" సంబరంగా అడిగాడు ఆటో డ్రైవర్.

గిరీశం యిచ్చింది దొంగ రసీదేనని తెలుస్తునే వుండటంతో తాము మోసపోయామని గ్రహించాడు శర్మ. కాళ్ళూ చేతులు ఆడలేదు. కళ్ళు బైర్లు కమ్మడంతో అక్కడున్న కుర్చీలో కుప్పకూలిపోయాడు.

"అవును" అని ఊరుకున్నాడు శ్రీధర్.

"మాది కూడా ఆ ఊరే సార్..! నా పేరు రామకృష్ణ" ఉత్సాహంగా అన్నాడు ఆటోడ్రైవర్.

"ఆఁ..అలాగా..?" అన్నారే గాని పెద్దగా పట్టించుకోలేదు యిద్దరూ.

ఆటో దిగి ట్రావెల్స్ ఆఫీసులో అడుగుపెట్టారు. అక్కడ యధావిధిగా ఒకటే సమాధానం.. గిరీశం పత్తాలేడని.. శ్రీధర్ గట్టిగానే తగులుకున్నాడు. అయినా ఫలితం శూన్యం. స్థానిక బలం ముందు పాపం యిద్దరూ, ఏంచెయ్యలేకపోయారు. విసుగుతో బయటకొచ్చేసారు. యిక పోలీస్ కంప్లైంట్ ఒక్కటే మార్గమని తోచి.

ఎదురుగా రామకృష్ణ ఆటోతో అక్కడే వున్నాడు. మారు మాట్లాడకుండా తండ్రీ కొడుకులు ఆటో ఎక్కి కూర్చున్నారు. యిద్దరి ముఖాలూ చూస్తే ఏదో సమస్యలో చిక్కుకున్నట్టు కనిపెట్టాడు రామకృష్ణ.

"సార్..! మీరు చూస్తుంటే ఏదో చిక్కుల్లో ఉన్నట్టు తోస్తోంది. మీ ఊరి వాడిని కాబట్టీ నాతో మీ బాధ పంచుకుంటే మీ భారం తీరడమేగాక నాచేతనైనదేదైనా వుంటే తప్పక చేస్తా" చనువుగా అన్నాడు రామకృష్ణ.

శర్మ రామకృష్ణ వైపు సూటిగా చూసాడు. ఒక్క నిమిషం ఆలోచించి మొత్తం జరిగిందీ పూసగుచ్చినట్టు చెప్పాడు.

రామకృష్ణకి మొత్తం విషయం అర్థమైంది.

"సార్.. చూస్తుంటే ఆ గిరీశం. ఈ ట్రావెల్సోళ్ళూ యిద్దరూ తోడు దొంగలల్లే వున్నారు. మీరు, ఏమీ అనుకోనంటే ఒక మాట! మీరు తెచ్చుకున్న డబ్బు కూడా ఖర్చైపోయిందంటున్నారు. మీరు మా యింటికొచ్చీ నా దగ్గర ఒకటిరెండ్రోజులుండీ మీ చివరి ప్రయత్నం చేయండీ. నేను కూడా మీకు తోడుగా వుంటా" అన్నాడు రామకృష్ణ.

ఈ మాటలకి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు తండ్రీ కొడుకులు. ముక్కూ మొహం తెలియకపోయినా రామకృష్ణ అన్న మాటలు చాలా ఊరట కలిగించాయి యిద్దరికి. కానీ ఏదో ఒక ఊరివారమైనంత మాత్రాన ఎవ్వరో తెలియకుండా సహాయం పొందడానికి మొహమాటమేసింది శర్మకి. యిది అర్థం చేసుకున్న రామకృష్ణ.


"మరేం ఆలోచించకండీ సార్..! నాతో రండీ. మొహమాట పడకండీ" అన్నాడు చొరవ చూపుతూ.

మౌనంగానే రామకృష్ణ ప్రతిపాదనని ఆమోదించాడు శర్మ.

లాడ్జికి వెళ్ళి లాడ్జి ఖాళీచేసి వున్న కాస్త డబ్బులో బిల్లు చెల్లించి రామకృష్ణ వెంట నడిచారు తండ్రీ కొడుకులు. ఆటో రివ్వున తన యింటి వైపు పోనిచ్చాడు రామకృష్ణ.

యింటికి చేరి యిద్దర్నీ సాదరంగా ఆహ్వానించాడు రామకృష్ణ. యింట్లోకి అడుగుపెడుతూ చుట్టూ కలియ చూసాడు శర్మ. చాలా నీట్‌గా వున్నంతలో పొందికగా అలంకరించబడి వుంది. 'ఫరవాలేదే..! ఆటో డ్రైవరైనా

(మిగతా 27వ పేజీలో)






యింటిని అందంగా తీర్చిదిద్దాడే!" అని మనసులో అనుకోకుండా వుండలేకపోయారు యిద్దరూ.

"నాన్నా..! నాన్నా..!" అంటూ తండ్రిని పిలిచాడు రామకృష్ణ.

లోపల్నుండీ వచ్చిన రామకృష్ణ తండ్రి శర్మని చూసి ఆశ్చర్యపోయాడు.

"శర్మగారూ..! మీరా..?" అంటూ ఆనందాశ్చర్యాలకి గురయ్యాడు.

శర్మ ఎదుట వ్యక్తిని చూసి షాక్ తిన్నారు.

"రండి సార్..! రండీ.. కూర్చోండి" అంటూ అభిమానంతో కుర్చీ తుడుస్తూ అన్నాడు రామకృష్ణ తండ్రి.

'నువ్వా.. నువ్వా.. రంగడివి కదూ..!' ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టుంది ఆ మాట శర్మ నోట.

"అవును, రంగడ్నే..!" గుర్తుపట్టినందుకు సంతోషంగా అన్నాడు రంగడు.

అయితే ఊహించని విధంగా రంగడి యింటికి రావడం శర్మకి అస్సలు నచ్చలేదు. మనసులో ఏదోలా గుంది. స్థిమితంగా కూర్చోలేకపోయాడు. చిన్నతనంగా కూడా తోచింది. ఆ చిన్నతనానికి వెనుక పెద్ద కారణమే వుంది. అప్రయత్నంగా గతం గుర్తుకొచ్చింది.

⁂

"అయ్యా.. శర్మగారూ..! మీతో చిన్న పని పడిందండీ.." ఒకింత మొహమాటంగా అన్నాడు రంగడు.

"చెప్పవయ్యా..ఏంటి..?" అన్నాడు శర్మ. అతడొచ్చిన పని ఏమైయుంటుందా అని ఒకవైపు మనసులో ఆలోచిస్తూనే.

"అదీ.. మా పెద్దోడు యింటర్ ఫేలైయ్యాడు. ఇవాళా రేపూ, పెద్ద పెద్ద చదువులు చదివినోళ్లే ఉద్యోగాలు లేక బలాదూరుగా తిరుగుతున్నారు. మావాడి చదువుకి ఎవరుద్యోగం యిస్తారు చెప్పండీ..? అందుకే వాడొక నిర్ణయానికొచ్చీ సొంత కాళ్ళమీద నిలబడాలనుకుంటున్నాడు. వాడికెలాగో డ్రైవింగ్ వచ్చు. అందుకే ఓ ఆటో కొనిపెడితే వాడి బ్రతుకు వాడు బ్రతకడమే కాక మాకు చేదోడూ వాదోడుగా వుంటానన్నాడు. అంత డబ్బు ఒక్కసారి మేం తెచ్చేదెలా?.. అందుకే బ్యాంకులో లోన్‌కోసం వెళితే, లోనైతే యిస్తామన్నారు గానీ ఎవరైనా పెద్ద మనిషిని గ్యారెంటీగా పెట్టమన్నారు. మీరే పెద్దమనసుతో ఆ గ్యారెంటీ ఏదో యిస్తే మాకు చాలా మేలుచేసిన వారవుతారు" ప్రాధేయపడుతూ అన్నాడు రంగడు.

రంగడు వచ్చిన పని తెలుసుకుని ఆలోచనలో పడ్డాడు శర్మ. రంగడు తెలియని మనిషి కాదు. పొలంలో కూలీ పని చేసుకుని చాలా కాలంగా

మా పెద్దోడు యింటర్ ఫేలైయ్యాడు. ఇవాళా రేపూ, పెద్ద పెద్ద చదువులు చదివినోళ్లే ఉద్యోగాలు లేక బలాదూరుగా తిరుగుతున్నారు. మావాడి చదువుకి ఎవరుద్యోగం యిస్తారు చెప్పండీ..? అందుకే వాడొక నిర్ణయానికొచ్చీ సొంత కాళ్ళమీద నిలబడాలనుకుంటున్నాడు. వాడికెలాగో డ్రైవింగ్ వచ్చు. అందుకే ఓ ఆటో కొనిపెడితే వాడి బ్రతుకు వాడు బ్రతకడమే కాక మాకు చేదోడూ వాదోడుగా వుంటానన్నాడు.

బ్రతుకు వెళ్ళదీస్తున్నాడు. యిటు సర్కారోళ్ళు గానీ.. సొంత మనుషులు గానీ ఎప్పుడూ ఆదుకున్న పాపాన పోలేదు. అందుకే తనవద్ద కొచ్చాడు. గ్యారెంటర్‌గా వుండటమంటే లోను తీసుకున్న వ్యక్తి ఆ లోను తీర్చకపోతే బ్యాంకు ముక్కుపిండీ మరీ గ్యారంటర్ దగ్గర నుండీ వసూలుచేస్తుంది. ఏదైనా కారణాలతో రంగడు లోను తీర్చకపోడం అది కాస్త తన మెడకి చుట్టుకుంటుంది. బాగా ఆలోచించీ..

"చూడు రంగా..! నీ పరిస్థితి చేసుకోగలను కానీ, నువ్వా లోను సక్రమంగా తీరుస్తావన్న నమ్మకం నాకు లేదు. అందుకే మరేం అనుకోకు నీకు సహాయం చేయలేను" నిర్మొహమాటంగా చెప్పాడు శర్మ.

కుండబద్దలు కొట్టినట్టు లేదని చెప్పిన శర్మ మాటలకి హతాశుడైయ్యాడు రంగడు. ఈ సమాధానానికి చిన్నబుచ్చుకుని వెనుదిరిగాడు రంగడు.

ఆ తరువాత రంగడి కుటుంబం ఏమైందో కూడా శర్మ ఎప్పుడూ పట్టించుకోలేదు.

⁂

గతం గుర్తుకు రాగానే యిక అక్కడ ఒక్క క్షణం యిమడలేకా..

"మీ అబ్బాయి బలవంతం చేస్తే వచ్చాం, మిమ్మల్ని యిబ్బంది పెట్టడం భావ్యంగా తోచడం లేదు. వస్తాం" అంటూ లేచి నిలబడ్డాడు శర్మ.

తండ్రి నిర్ణయానికి విస్తుపోయాడు శ్రీధర్. యిటు రామకృష్ణకి అంతా అయోమయంగా వుంది.

"ఒక్క క్షణం శర్మగారూ..! మీ పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. చూస్తుంటే మీరు గతాన్ని దృష్టిలో వుంచుకుని మాటలాడుతున్నట్టుంది. ఆరోజు జరిగింది నేను అప్పుడే మరచిపోయాను. మీరు ఆ రోజు సహాయపడలేదని నేనెప్పుడూ మిమ్మల్ని తప్పు పట్టలేదు. అలాగే మీ పైకోపమూ లేదు. యిప్పుడు మీరున్న పరిస్థితి ఏంటో నాకు తెలుసు. మీరు పంతానికి పోయి యిక్కడ్నుంచి వెళ్ళిపోతే ఊరుకాని ఈ ఊరులో యిబ్బందిపడతారు. అది నాకు అస్సలు యిష్టం లేదు" శర్మగారి చేతులు పట్టుకుని ఆపే ప్రయత్నం చేసాడు రంగడు.

"వద్దు రంగా..! వద్దు.. యింకా నన్ను నీ చర్యలతో నన్ను సిగ్గు పడేటట్టు చెయ్యకు. మానవత్వం అంటే ఏంటో తెలిసేలా చెప్పావు" కంట నీరొక్కటే తక్కువగా అన్నాడు శర్మ.

"అంత పెద్ద మాటలొద్దు శర్మగారూ! మీరేం అనుకోనంటే నాదొక మాట. మీరు పోగొట్టుకున్న డబ్బైతే తెచ్చివ్వలేకపోవచ్చు. అలాగే దుబాయ్ లాంటి దేశాల్లో మీ అబ్బాయికి ఉద్యోగం యిప్పించలేకపోవచ్చు. కానీ యిక్కడ నేను పనిచేస్తున్న స్కూల్లో ఓ మాష్టారి ఉద్యోగం మీ అబ్బాయికి యిప్పించగలను. అదీ మీకు అభ్యంతరం లేకపోతే..." అన్నాడు రంగడు.

శర్మకి నోట మాట రాలేదు. ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో కూడా తెలియని పరిస్థితి. అతడి దృష్టిలో రంగడు చాలా చాలా ఎదిగిపోయాడు.

★

రచయిత చిరునామా:
కారంపూడి వెంకట రామదాస్,
2-4-989/202, శ్రీసాయి రెసిడెన్సీ,
రోడ్ నెం.5, సమతాపురికాలనీ,
హైదరాబాద్- 500 035.

